క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు


కార్వేటినగరం తహసీల్దార్ భగవతి

కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా భగవతి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నింద్ర మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా వైఎస్‌ఆర్ జిల్లాకు వెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం మండల తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలింపులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ భగవతిని శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. మండల సర్వేయర్ సురేష్, డీటీ సీలావతి, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ పురం – అమర్‌నాథ్


అమర్‌నాథ్

శ్రీరంగరాజపురం: నూతన తహసీల్దారుగా అమర్‌నాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రైతులకు, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

నింద్ర – శేషగిరిరావు


శేషగిరిరావు

నింద్ర: మండల తహసీల్దార్ గా శేషగిరిరావు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు వితరణ


కమిటీ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న దాతలు

నగరి: బస్టాండు ప్రాంగణం కుశస్థలీనది సమీపం నవీకరిస్తున్న మునీశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు కోనేరి అమృతమ్మ, సుబ్రమణ్యం దంపతులు రూ.50501 విరాళాన్ని అందించారు. శనివారం ఆలయం వద్దకు వెళ్లిన వారు ఆలయ అభివృద్ధి కమిటీ వారికి విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతినాయుడు, గుణశేఖర్, మురళీమోహన్ పాల్గొన్నారు.

రాయితీతో డ్రిప్ పరికరాలు

వెదురుకుప్పం: సూక్ష్మ నీటి పథకం కింద రైతులకు రాయితీ ద్వారా డ్రిప్ పరికరాలను అందజేస్తున్నట్లు ఏపీ ఎంఐపీ ఏరియా కోఆర్డినేటర్ జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న రైతులు బిందు సేద్యం కింద పంటల సాగు చేసే క్రమంలో డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఆయా రైతుల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ పత్రాలను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో అయినా లేక మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి, ఉద్యాన శాఖాధికారి వద్ద గాని రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు 79950 10012 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అలరించిన మహాభారత పారాయణం


మహాభారత పారాయణం చేస్తున్న భాగవతార్లు

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ద్రౌపతీ తిరనాళ్లలో భాగంగా శనివారం మహాభారత పారాయణం నిర్వహించారు. భాగవతార్‌లు శశికళ, కభాలీశ్వరన్ మహాభారత పారాయణం చేశారు. తిరనాళ్లు ముగిసేంత వరకు ఆలయం వద్ద మహాభారత పారాయణం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ ఎంవీ నటరాజన్ తెలిపారు. ఏడాదికి ఒకసారి తిరనాళ్ల సందర్భంగా ద్రౌపదమ్మ ఆలయం వద్ద మహాభారత పారాయణం వింటే చేసిన పాపాలు నివృత్తి అవుతుందన్న ఆచారం భక్తుల్లో ఉండడంతో పారాయణం వినడానికి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుత్తూరు: వడమాలపేట మండలం అంజేరమ్మ ఆలయం వద్ద శనివారం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. వడమాలపేటకు చెందిన ఉమాశంకర్, చెంచయ్య బైక్‌పై పుత్తూరు నుంచి వడమాలపేటకు వస్తుండగా, తిరుత్తణికి చెందిన అరుణ్ మోటార్ సైకిల్‌పై వస్తూ వెనక నుంచి వేగంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. గాయపడ్డ వారిని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విజ్ఞానం వెలికి తీసేలా... ప్రతిభాన్వేషణ



విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం, విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన్ భారతి సంయుక్తంగా ప్రతి ఏటా ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు వీవీఎం పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది. – కార్వేటినగరం

- హైస్కూల్ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ప్రతిభా ఉపకార వేతనాలు
- ఎంపికైన వారికి ఉపకార వేతనంతో పరిశోధన సంస్థలో ఇంటర్న్‌షిప్
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 15 వరకు గడువు

ప్రతిభాన్వేషణ పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్, 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లీషుతోపాటు ప్రాంతీయ భాషల్లో నిర్వహించే పరీక్షను విద్యార్థుల ఆసక్తి మేరకు భాష ఎంపిక చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం

ఆసక్తి గల విద్యార్థులు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి వివరాలను నమోదు చేసుకుని, పరీక్ష రుసుము రూ.200 చెల్లించాలి. సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు.

ఎంపిక ఇలా...

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మంది చొప్పున మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26న లేదా డిసెంబర్ 3, 10, 17వ తేదీల్లో ఏదో ఒక రోజున రాయాల్సి ఉంటుంది.

రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని జాతీయస్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024 –25 విద్యా సంవత్సరానికి జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ తదితర ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థల్లో 1–3 వారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అక్టోబర్ 10న మాక్‌టెస్ట్

వీవీఎం మాక్ టెస్ట్ అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్షలు అక్టోబర్ 20–27వ తేదీల మధ్యన నిర్వహిస్తారు. ఆయా తేదీల్లో ఒక తేదీని ఎంపిక చేసుకుని పరీక్ష రాసేందుకు వీలుంది.

> **ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలి**
> విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించే విధంగా వీవీఎం పరీక్ష ఉంటుంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేలా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేయించాలి. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తగు శ్రద్ధ చూపాలి.
> – విజయకుమార్, ఎంఈఓ, కార్వేటినగరం

తల్లిపాలు పట్టించడం భారం అనుకోవద్దు


తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న వైద్యులు


తల్లిపాల వారోత్సవాల ర్యాలీ


తల్లిపాల వారోత్సవంపై అవగాహన

నగరి: ముర్రుపాలు పట్టించడాన్ని తల్లులు భారం అనుకోరాదని డాక్టర్ ఎయిశ్‌అరసు అన్నారు. శనివారం సత్రవాడ యూపీహెచ్‌సీలో సీడీపీఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో పాల్గొని తల్లులకు తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని అన్నారు. బిడ్డకు 2 సంవత్సరాలపాటు తల్లి పాలు కొనసాగించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ తల్లిపాలు తాగించడంతో తల్లికి బిడ్డకు మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుందన్నారు. జబ్బులు, రోగాలు రాకుండా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష

కార్వేటినగరం: తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాత సంతవీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పిల్లలలో రోగనిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. డాక్టర్ హేమశ్రీ, పర్యవేక్షకులు ఇందిర, శామిని, వైద్య సిబ్బంది అంబరీషరాజు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ

గంగాధర నెల్లూరు: పసిపిల్లలకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు ముఖ్యమని సీడీపీఓ వినత శ్రీ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై అపోలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పసిపిల్లలకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే, రోగాల బారిన పడకుండా ఉండాలంటే తల్లిపాలు ముఖ్యమని అన్నారు. మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపోలో ఫౌండేషన్ సిబ్బంది, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: తల్లి పాలు బిడ్డకు మంచిదని వైద్యాధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఏడు సచివాలయాల గర్భవతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొమ్మాయిపల్లి, చిన్న తయ్యూరు, కటికపల్లి, కొత్తపల్లి, పిల్లరికుప్పం, సెట్టివనాథం, వి.వి.పురం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

విజయపురంలో..

విజయపురం: బిడ్డలకు తల్లిపాలే శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. అనంతరం గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ చాముడేశ్వరి, ఆశవర్కర్ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శివగామి, తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగు లాభదాయకం


సమావేశంలోమాట్లాడుతున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: సేంద్రియ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. శనివారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి వస్తాయని తెలిపారు. భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడడం, అంతర పంటల సాగుతో మిత్ర పురుగుల వృద్ధి, రసాయనిక మందుల వాడకం తగ్గించడం తదితర విషయాలపై రైతులకు తరువుగా వివరించారు. పంట సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. కత్తెర పురుగును తగిన జాగ్రత్తలతో నివారించుకోవాలని పేర్కొన్నారు. పలు పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సునీత, రైతులు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


పాడి పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ

పాలసముద్రం: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ సమక్షంలో ఉచిత పశు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, వాటి నివారణ చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామాల్లో ఉండే వెటర్నరీ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా చేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు, పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం

గంగాధర నెల్లూరు: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతతో లక్ష్యాలు సాధించడమే విధిగా పనిచేయాలని చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జి.రాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో సంక్షేమ సాధికారత జిల్లా అధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వసతి గృహాల్లో పనిచేసే ఫోర్త్ గ్రేడ్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్‌గ్రేడ్ ఉద్యోగులు విధులు, సర్వీస్ సంబంధమైన సమస్యల వినతులపై సానుకూలంగా చర్చించారు. రాబోయే విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడం కోసం ఇప్పటి నుండే సరైన ప్రణాళికతో సహకరించాలని కోరారు. ఏఎస్‌డబ్ల్యూఓ వి.షకీల, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

విజయపురం: మండలంలోని మంగళం ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని లత చేతుల మీదుగా 21 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతలు అందించే విద్యా సామగ్రిని అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదవాలని ఉపాధ్యాయుడు పాండిరాజన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్చాలని దాత చంద్రయ్య కోరారు.

ఎస్సీ వర్గీకరణ హర్షనీయం


స్వీట్లు పంపిణీ చేస్తున్న దళిత నాయకులు


విజయపురం: రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వడంపై మందకృష్ణ మాదిగ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ఆధ్వర్యంలో విజయపురం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అలాగే రెవెన్యూ సిబ్బందికి స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలలో అత్యంత వెనుకబడిన సెక్షన్ల జీవితాలను మెరుగు పరచేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. మునివేలు, శివయ్య, ముని, శివప్రసాద్, అయ్యప్ప, సూర్య, పురుషోత్తం యువరాజ్, గిరి, రమేష్, మహేష్, యువరాజ్, ముని కృష్ణన్ పాల్గొన్నారు.

విద్యార్థుల స్వచ్ఛ భారత్

పుత్తూరు: ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా మైదానంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వీరయ్య మాట్లాడుతూ కళాశాలలోనే కాకుండా ఇళ్ల పరిసరాల్లోనూ విద్యార్థులు పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రఘురామన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర


మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర అన్నారు. శనివారం వినాయకపురం గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య సేవలందిస్తోందని తెలిపారు. గిరిజనులు సైతం తమ పిల్లలను బడికి పంపించి చక్కగా చదివించాలని సూచించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. 18 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు వివాహాలు చేయరాదని సూచించారు. అలాగే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సూచించారు. 40 ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకొని, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాలపాటు నడవాలని సూచించారు. అనంతరం గిరిజన హక్కులపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రం మార్పు

వైద్య శిబిరం అనంతరం జడ్జి రాఘవేంద్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పెచ్చులూడుతూ శిథిలావస్థలో ఉన్న భవనంలో పిల్లలను ఉంచడంపై అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నించారు. పిల్లలను వెంటనే పక్కనే ఉన్న పాఠశాలలోని వరండాలోకి మార్పించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్, డాక్టర్లు డి.హేమశ్రీ, కె.భార్గవి, ఆషా, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.పురుషోత్తం, సెక్రెటరీ మురళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు తప్పనిసరి


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

కార్వేటినగరం: విద్యార్థులకు కంటి పరీక్షలు ఎంతో అవసరమని శ్రీలక్ష్మీనరసింహ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు కంటి చూపు ఎంతో అవసరమని, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, ప్రభుత్వ వైద్యాధికారులతో ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంఓ సుమలత, పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కొట్రకోనలో ప్రత్యేక వైద్య శిబిరం

గంగాధరనెల్లూరు: అపోలో మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మండలంలోని కొట్రకోన గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రజలకు రక్తపోటు, చక్కెర వ్యాధి, కంటిచూపు సమస్యలు, ఇతర రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తగిన మందులు, సలహాలు ఇచ్చారు. గ్రామంలోని దాదాపు 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అపోలో మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.అశోక్‌కుమార్ రెడ్డి, డాక్టర్ దీప్తి, డాక్టర్ భారతి, మండల ప్రాథమిక ఆరోగ్యా శాఖధికారి డాక్టర్ దుర్గాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

